క్లుప్తంగా

యోగా గురువుకు సన్మానం



సతీశ్‌ను సన్మానిస్తున్న యోగా ప్రతినిధులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో 25 నుంచి 27 వరకు నిర్వహించిన రెండో ఏషియన్ యోగాసన పోటీలలో జడ్జిగా పాల్గొని సన్మానం పొందినట్లు ప్రముఖ యోగా గురువు తోట సతీశ్ తెలిపారు. 21 దేశాలకు చెందిన యోగా సాధకులు ఈ పోటీలో పాల్గొన్నారని, ఆదివారం రాత్రి జరిగిన ముగింపు కార్యక్రమంలో కేంద్ర మంత్రి హర్ష మల్హోత్రా, వరల్డ్ యోగాసన అధ్యక్షుడు డాక్టర్ జయదీప్‌ఆర్య, యోగాసన భారత్ అధ్యక్షుడు ఉదిత్ సెత్, ఏషియన్ యోగాసన అధ్యక్షుడు డాక్టర్ సంజయ్ సతీశ్‌కు జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించినట్లు ఆయన తెలిపారు.

ఇందిరమ ఇళ్ల ఎంపికలో అవకతవలు: సీపీఎం నేత



మాట్లాడుతున్న యాదగిరి

మద్దూరు(హుస్నాబాద్): ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎంపికలో అవకతవలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆలేటి యాదగిరి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల ఎంపికలో అధికారులు కాంగ్రెస్ నాయకుల చేతిలో కీలుబొమ్మలుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అసలైన లబ్ధిదారులకు అన్యాయం చేస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. సమావేశంలో షఫి, కనకయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు కార్మికుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పాఠశాల పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రభుత్వం కేటాయించిన స్కూల్ ఫెసిలిటీ గ్రాంట్(పారిశుద్ధ్య కార్మికుల నిధులను అన్ని పాఠశాలలకు మంజూరు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, శశిధర్‌శర్మ డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఈ శ్రీనివాస్ రెడ్డికి సోమవారం వారు వినతిపత్రం అందించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం మూడు నెలలకు సంబంధించిన నిధులు జమయ్యాయని, ఇంకా మూడు నెలలకు చెందిన నిధులు జమకాలేదన్నారు. ఈ నిధులు త్వరలోనే సంబంధిత పాఠశాలల ఖాతాల్లో జమ అవుతాయని డీఈఓ తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, సయ్యద్ సందాని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఎంపిక



కీర్తనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాగ్నిజెంట్ టెక్నాలజీస్ కంపెనీ నిర్వహించిన ధ్యేయ- 2025 ఎంపిక పరీక్షలో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని బోనాల కీర్తన ఎంపికయినట్లు హెచ్‌ఎం మనోహర్ తెలిపారు. పాఠశాలలో సోమవారం ఆ విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగ్నిజెంట్ కంపెనీ నిర్వహించిన పరీక్షలో కీర్తన రాణించడం సంతోషంగా ఉందన్నారు. ఆ సంస్థ నిర్వాహకులు ఆదివారం హైదరాబాద్ కార్యాలయానికి కీర్తనను ఆహ్వానించి లాప్‌టాప్‌ను బహూకరించారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, కోట ప్రభు, అశోక్ రెడ్డి, శ్రీలత, సుజాత, సరస్వతి, బాలలక్ష్మి, అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

నర్సారెడ్డిని కలసిన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు



నర్సారెడ్డిని సన్మానిస్తున్న డైరెక్టర్లు

ములుగు(గజ్వేల్): డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కూతాడి శ్రీనివాస్, వాజీద్ గజ్వేల్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డైరెక్టర్లుగా తమకు అవకాశం కల్పించినందుకు వారు నర్సారెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, నర్సింహులు, మహేశ్, రమేశ్ పాల్గొన్నారు.

గుక్కెడు నీరివ్వండి!

పునరావాస కాలనీవాసుల గోస
- 'గౌరవెల్లి'కి భూములిచ్చి.. సర్వస్వం కోల్పోయి..
- నిరుపయోగంగా భగీరథ వాటర్‌ట్యాంక్
- రూ.1,500 చెల్లించి కొనుగోలు
- కనీస వసతులు కల్పించని అధికారులు

గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం సర్వసం కోల్పోయిన వారు ఇప్పుడు కనీసం తాగునీరు కరువై కన్నీరు కారుస్తున్నారు. వాళ్లంతా రిజర్వాయర్ నిర్మాణానికి భూములిచ్చి మొత్తం కోల్పోయ్యారు. ఇప్పుడు గుక్కెడు తాగునీరు లేక గోస పడుతున్నారు. తాగు, సాగునీటి కోసం భూములిచ్చిన వారికి కనీస వసతులు కల్పించంలో అధికారులు, నేతలు విఫలమయ్యారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని నందారం క్రాసింగ్ వద్ద పునరావాస కాలనీ ఏర్పాటు చేశారు. ఈ కాలనీలో సుమారు 185 కుటుంబాలు నివసించేలా దాదాపు 26 ఎకరాల భూమిని కేటాయించారు. ఒక్కొక్కరికి 250 గజాల చొప్పుల ఇళ్ల స్థలాలతో పాటు గత ప్రభుత్వం హయాంలో పట్టాలిచ్చారు. దీంతో ప్రస్తుతం సుమారుగా 100 కుటుంబాల వాళ్లు అక్కడ ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు.

తాగునీటి కోసం ఇక్కట్లు

పునరావాస కాలనీలో ప్రజల కోసం భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మించారు. కాని ట్యాంక్‌కు పైపులైన్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో కాలనీ నిర్వాసితులు గొంతు తడుపుకోవడం కోసం అష్టకష్టాలు పడుతున్నారు. డబ్బులు చెల్లించి పక్క గ్రామాల నుంచి ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేసుకోవల్సిన దుస్థితి నెలకొంది. రామవరం, నందారం తదితర గ్రామాల్లో రైతుల బావుల నుంచి సుమారు రూ.1000 నుంచి రూ.1,500 చెల్లించి నీళ్ల కొనుగోలు చేసుకొంటున్నామని కాలనీవాసులు చెప్పన్నారు. 3, 4 కుటుంబాలు కలిసి ఒక ట్యాంకర్ నీళ్లకు రూ.1,500 చెల్లిస్తున్నారు.

తహసీల్దార్‌కు మొర

తహసీల్దార్ అనంతరెడ్డి సోమవారం పునరావాస కాలనీని సందర్శించడంతో నిర్వాసితులు ఆయనకు మొరపెట్టుకున్నారు. తాగునీరు రావడం లేదని,



నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ ట్యాంకు

ప్రస్తుతం వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా ఉంటుందని వాపోయారు. ప్రాజెక్టు కోసం తాము భూములిచ్చి త్యాగాలు చేస్తే కనీసం తాగునీటి సదుపాయం కల్పించలేదని తహసీల్దార్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలనీని పర్యటించిన మంత్రి పొన్నం ఓఎస్‌డీ శ్రీనివాస్‌రెడ్డితోపాటు మండల స్థాయి అధికారులకు తమ తాగునీరు కష్టాలు వివరించామని అయినా ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోయారు. భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా తాగునీరు గోస తప్పడంలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి కష్టాలు తీర్చాలని, లేకపోతే ఆందోళన బాట పడతామని నిర్వాసితులు హెచ్చరిస్తున్నారు.



తహసీల్దార్ అనంతరెడ్డికి మొరపెట్టుకుంటున్న నిర్వాసితులు

మంచినీళ్ల కోసం గోస



మంచినీళ్లు తాగడానికి గోస పడుతున్నాం. భగీరథ నీళ్లు రావట్లేదు. నీళ్లను కొనుగోలు చేసుకొంటున్నాం. పునరావాస కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించవల్సిన అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఇంటి నిర్మాణం కోసం వేసిన బోర్లు ఎండిపోతున్నాయి. ఒక్కొక్కరు ఐదు నుంచి ఎనిమిది బోర్లు వేసినా నీళ్లు రావట్లేదు. మాకు తాగునీటి సౌకర్యం కల్పించాలి.

– ముడావత్ కిషన్ నాయక్, పునరావాస కాలనీ

పట్టణాభివృద్ధికి శక్తినంతా వినియోగిస్తా

మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: మంత్రిగా తనకున్న శక్తినంతా వినియోగించి పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మాజీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులకు సోమవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో అప్పటి మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ హుస్నాబాద్ అభివృద్ధికి కృషి చేశారన్నారు. తన హయాంలో హుస్నాబాద్ ప్రాంతాన్ని ఊహించని విధంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఎల్లమ్మ చెరువు సుందరీకరణ కోసం రూ.18 కోట్లు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయని, మరో రూ.17కోట్లు మంజూరు కానున్నాయని వెల్లడించారు. ఇప్పటికే 150 పడకల ప్రభుత్వాస్పత్రి, ఇంజనీరింగ్ కళాశాల మంజూరైందని, అలాగే చౌటపల్లిలో పారిశ్రామిక కారిడార్, ఎల్కతుర్తి ట్రిపుల్ ఐటీ కోసం స్థల సేకరణ జరుగుతోందని చెప్పారు. కేంద్రం సహకారంతో వంగరలో నవోదయ పాఠశాలను మంజూరు చేయించామని, పట్టణంలో శాశ్వత తాగునీటి సౌకర్యం కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వల నిర్మాణం కోసం రూ.430 కోట్లతో స్థలసర్వే జరుగుతోందని, కొత్తపల్లి నుంచి హుస్నాబాద్‌కు నాలుగు లేన్ల రహదారి పనులు త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. మున్సిపాలిటికి జాతీయ అవార్డులు రావడానికి పాలకవర్గం, అధికారులు కృషి చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, ఏసీపీ సతీశ్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, వైస్ చైర్ పర్సన్ అనిత తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను విమర్శించే హక్కు లేదు

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: అసమర్థపాలనతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను విమర్శించే నైతిక హక్కు లేదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. గజ్వేల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఒక్క పిలుపుతో వరంగల్ సభకు లక్షలాదిగా జనం తరలి వచ్చారన్నారు. ప్రభుత్వం విఫలమైందనేదానికి ఈ సభ విజయవంతం కావడమే నిదర్శనమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు కేసీఆర్‌పై తప్పుడు విమర్శలు మానుకోవాలని, లేని పక్షంలో ప్రజల్లో మరింత చులకనవుతారని హెచ్చరించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న 826 కల్యాణలక్ష్మి చెక్కుల విడుదలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ చొరవ చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాజమౌళి, మధు, నవాజ్‌మీరా, గోపాల్‌రెడ్డి, విరాసత్ అలీ, దేవేందర్, కనకయ్య, భూపాల్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధిలో భాగస్వాములుకండి



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ కోరారు. కళాశాల అలుమిని అసోసియేషన్ కమిటీ కన్వీనర్ కెప్టెన్ డాక్టర్ భవాని ఆధ్వర్యంలో సోమవారం పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశంతో కలిసి ఆమె మాట్లాడారు. కళాశాలకు అటానమస్ హోదా రావడం హర్షణీయమని, పూర్వవిద్యార్థులు కళాశాల అభివృద్ధికి సహకరించాలన్నారు. వచ్చే నెలలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయడంతో పాటు సంఘ సభ్యుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, కళాశాల అభివృద్ధి పనులకు అవసరమైన బ్యాంకు ఖాతాను తెరవాలని నిర్ణయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అలుమిని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సర్దార్‌ఖాన్, సహాయ కార్యదర్శి నర్సింహులు, కోశాధికారి శ్రీనివాస్, అధ్యాపకులు పెద్దిరాజు, పూర్వ విద్యార్థులు డాక్టర్ నరేశ్, లావణ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాస్' అమలుపై సమీక్ష

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ డివిజన్ బ్యాంకు అధికారులు నిర్దేశించిన త్రైమాసిక రుణ లక్ష్యం చేరుకోవాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు హరిబాబు సూచించారు. ఐటీసీ సమావేశ భవనంలో రాజీవ్ యువ వికాస్ పథకం అమలుపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి కల్పనకు ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాస్ పథకం లబ్ధిదారుల ఎంపికను మే 21లోగా పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని, ఒక కుటుంబానికి ఒక్కరిని మాత్రమే ఎంపిక చేయాలని చెప్పారు. దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి బ్యాంకర్ల సహకారంతో ఎంపికను పూర్తి చేయాలని, అలాగే రైతులకు అవసరమైన రుణాలను మంజూరు చేయాలని సూచించారు. సమావేశంలో బ్యాంకు మేనేజర్లు, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓలు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు సమస్యలపై ఎంపీకి వినతి



వినతి పత్రం అందజేస్తున్న నర్సింగరావు తదితరులు

చేర్యాల(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్ల మంజూరి విషయంలో నెలకొన్న సమస్యపై భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి పలువురు కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందించారు. మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో ఎంపీని కలిసి ఇళ్ల మంజూరులో నెలకొన్న సమస్యల గురించి వివరించారు. అర్హుల ఖాళీ స్థలం రిజిస్ట్రేషన్ కాగితాలు లేకుండా సాదాభయానా పత్రాలు ఉండడంతో మంజూరు ఇవ్వడం లేదని తెలిపారు. ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని అదే ఇంటి నంబరుతో ధ్రువీకరించి మంజూరు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఎంపీ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ మల్లేశం, ఎండీ ఖాజా, నాయకులు దుర్గయ్య, పరశురాములుగౌడ్, కుమార్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించడం కేసీఆర్‌కు తగదు

పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక రాష్ట్రాన్ని అందించిన సోనియా గాంధీని, కాంగ్రెస్ పార్టీని మాజీ సీఎం కేసీఆర్ విమర్శించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రసాదించిన కాంగ్రెస్‌ను విలన్ అని మాట్లాడిన కేసీఆర్‌కు అధికారం పోగానే మతిభ్రమించిందన్నారు. తన కుటుంబం సభ్యులతో కలిసి సోనియాగాంధీకి సాష్టాంగ నమస్కారం చేసిన విషయాన్ని మరిచిపోయారా అని ఎద్దేవా చేశారు. దేశంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోనే దేశవ్యాప్తంగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలయ్యాయని గుర్తుచేశారు. తిరిగి అధికారంలోకి వస్తామని కలలు కనడం మానుకోవాలని, బీఆర్ఎస్ నాయకులను నమ్మేస్థితిలో ప్రజలు లేరన్నారు. నాయకులు మధు, గయాజొద్దీన్, హర్షద్, రాజిరెడ్డి, మాజీద్, దుర్గ ప్రసాద్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపుపై అధికారుల నిర్లక్ష్యం

- రూ.20లక్షలు పరిహారమివ్వాలి
- వివిధ పార్టీల నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): మైనింగ్, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలింపు జరుగుతోందని బీఆర్ఎస్, సీపీఎం, బీజేపీ, బీసీ సంఘాల నాయకులు ఆరోపించారు. బెజ్జంకిలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయా పార్టీల మండల బాధ్యులు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేశం మాట్లాడారు. రైతులకు ఉపయోగపడే సారవంతమైన చెరువుల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయ పాలన పాటించకుండా రాత్రి వేళ్లో మట్టి తరలించడం వల్ల టిప్పర్ ఢీ కొని చత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ కూలీ మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబ సభ్యులకు రూ.20 లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, ఫాక్స్ వైస్ చైర్మన్ రమేశ్, రవి పాల్గొన్నారు.

తలంబ్రాల పంపిణీకి శ్రీకారం



తలంబ్రాలను సిద్ధం చేస్తున్న రామరాజు

గజ్వేల్‌రూరల్: భద్రాచల సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించిన ముత్యాల తలంబ్రాలను స్థానిక భక్తులకు అందించేందుకు శ్రీకారం చుడుతున్నట్లు రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ దేవస్థానం నుంచి 100 కిలోల తలంబ్రాలను అందజేశారని, త్వరలోనే 2లక్షల మంది భక్తులకు అందజేస్తామన్నారు.

కాంగ్రెస్‌లో వణుకు

సిద్దిపేటజోన్: ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివచ్చిన జనాన్ని చూసి కాంగ్రెస్ పార్టీలో వణుకు మొదలైందని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం వారు మున్సిపల్ కౌన్సిలర్లు సుందర్, మొహిజ్, పార్టీ లీగల్ సెల్ ప్రతినిధి భూపేశ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కనకరాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై హుస్నాబాద్ షీ టీం అవగాహన కల్పించింది. సోమవారం వారు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి ప్రజలకు వివరించారు. పిల్లల ప్రవర్తన గమనిస్తూ ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. షీ టీం బృందం సదయ్య, స్వప్న, ప్రశాంతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులను నమ్మి మోసపోవద్దు

గజ్వేల్‌రూరల్: అపరిచితులను నమ్మి మోసపోవద్దని షీ టీమ్ ఏఎస్ఐ శ్రీరాములు సూచించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతే తమ బాధ్యత అన్నారు. లావణ్య, శ్రీనివాస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంసీపీఐ నాయకులు

గజ్వేల్‌రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమమని ఎంసీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు చందర్‌రావు అన్నారు. గజ్వేల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మే 26 నుంచి 28 వరకు వరంగల్‌లో జరిగే ఎంసీపీఐ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనతో విసుగు చెందిన ప్రజలు మార్పుకోసం కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప చేసిందేమీలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలక ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, ఈ పరిస్థితుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటమే శరణ్యమని భావించి పార్టీ పునర్నిర్మాణం చేపట్టిందని చెప్పారు. కార్యకర్తలు, ప్రజలను పోరాటాలకు సిద్ధం చేయడానికి మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాంబయ్య, రవి, మధు, శేఖర్, స్వామి, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

సోనియా లేకపోతే తెలంగాణ వచ్చేది కాదు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి

హుస్నాబాద్: సోనియాగాంధీ లేకపోతే తెలంగాణ ప్రజల ఆకాంక్ష నేరవేరేది కాదని, తెలంగాణ వచ్చేది కాదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ విలన్ అని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నేతలు నిరసన వ్యక్తం చేస్తూ స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం తెలంగాణను అప్పులపాలు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చిందని, కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదని మండిపడ్డారు. వెంటనే కేసీఆర్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివయ్య, చందు, రవీందర్, ఎండీ హుస్సేన్, యాదవరెడ్డి, పున్న సది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రతిభను పెంచే శిక్షణ శిబిరాలు

కొండపాక(గజ్వేల్): సమ్మర్ క్యాంపులు విద్యార్థుల ప్రతిభను మరింత పెంచేందుకు దోహదం చేస్తాయని ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. కుకునూరుపల్లిలోని ప్రాథమిక పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే అంశాలను ఎంచుకోవడంపై హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు. ఉపాధ్యాయులు రాంచంద్రం, నాగరాణి, స్వరూప, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ సంస్కృతిపై అవగాహన అవసరం

తొగుట(దుబ్బాక): మండలంలోని ఎల్లారెడ్డిపేట పాఠశాలలో వేసవి శిక్షణ తరగతులను ఎంఈఓ నర్సయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు భారతీయ సంస్కృతిపై అవగాహన ఉండాలన్నారు. ఉపాధ్యాయులు మురళీధర్, రవికిరణ్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

◆ పేదింటి పెళ్లికి ఆర్థిక సహాయం

కొండపాక(గజ్వేల్): ఓ కూలీ కూతురు పెళ్లి కోసం బీజేపీ నాయకుడు రూ.15 వేలు సహాయం అందించి అండగా నిలిచారు. మండలంలోని ముద్దాపూర్‌కు చెందిన మంద చంద్రం కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అతడి కూతురుకు వివాహం కుదిరింది. దీంతో డబ్బుల కోసం ఇబ్బంది పడుతున్న ఆయకు గజ్వేల్ బీజేపీ నాయకుడు కాశమైన సందీప్ కుమార్ సోమవారం రూ.15 వేలు అందజేశారు. ఆయన వెంట స్వామి, కరుణాకర్, కిరణ్ తదితరులు ఉన్నారు.

◆ కొమ్మూరికి రుణపడి ఉంటాం

చేర్యాల(సిద్దిపేట): మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి రుణపడి ఉంటామని మండల పరిధిలోని ముస్త్యాల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ ఎన్నోయేళ్లుగా ఎదురు చూస్తున్న తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



చాట్లపల్లి హైస్కూల్లో పూర్వ విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పూర్వ విద్యార్థులు సమ్మేళనాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం 1999 -2000 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు కలుసుకొని సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, సుజాత, స్వప్నమాల, గీతాదేవి, సంధ్యారాణి, మంగళ జోషి, హెచ్‌ఎం నీలకంఠ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

15 యేళ్ల తర్వాత..

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల పరిధిలోని చాట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009-2010లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కల్యాణి, మమత, పవిత్ర, శ్యామల, రాజు, ప్రకాశ్, ఈదులు, కృష్ణ, రమేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.